క్లుప్తంగా

పురాణగాథలను చదవాలి



పుస్తకాలు చదువుతున్న విద్యార్థులు

మురళీనగర్: పురాణ గాథలను పఠనం చేయడం వల్ల పిల్లల్లో నైతిక విలువలు పెంపొందుతాయని ఉపాధ్యాయురాలు ఎస్.భూలక్ష్మి అన్నారు. మురళీనగర్ శాఖా గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా మంగళవారం ఆధ్యాత్మిక గ్రంథ పఠనం నిర్వహించారు. పురాణ గ్రంథాలు పఠించడం వల్ల కలిగే ప్రయోజనాలను ఆమె వివరించారు. ఆధ్యాత్మికత వల్ల మానసిక ప్రశాంతత, సత్ప్రవర్తన అలవడుతుందన్నారు. రామాయణం, భాగవతం గ్రంథాలను చదివి అందులోని మంచిని గ్రహించి స్నేహితులకు తెలియజేయాలన్నారు. విద్యార్థులతో వారికి ఇష్టమైన ఆధ్యాత్మిక గ్రంథాలను చదివించారు. స్టోరీ టెల్లింగ్, పుస్తక సమీక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో గ్రంథాలయ అధికారిణి వై. పద్మజ, పాఠకులు పాల్గొన్నారు.


ఘనంగా కుంచాలమ్మ దుర్గాలమ్మ మహోత్సవం



ఘటాలతో భక్తులు

మర్రిపాలెం: కుంచాలమ్మ, దుర్గాలమ్మ అమ్మవారి మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు మంగళవారం ఆలయ కమిటీ వైస్ ప్రెసిడెంట్, 53వ వార్డు అధ్యక్షుడు గుజ్జు వెంకటరెడ్డి అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారి ఘటాలను ఊరేగింపుగా భక్తులు ఆలయంలోకి తీసుకొచ్చారు. అలంకరణలో అమ్మవారిని భక్తులు దర్శించుకున్నారు. పెద్ద ఎత్తున భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి అమ్మవారిని దర్శించుకున్నారు. ఈ ఉత్సవాల్లో చైర్మన్ ఆశి చిన్నారావు రెడ్డి, ఉత్సవ కమిటీ చైర్మన్ నాగేశ్వరరావు, ప్రెసిడెంట్ లక్ష్మణరావు, సెక్రటరీ మోహన్‌రావు, క్యాషియర్ సుబ్రహ్మణ్యం,అర్చకుడు నాగశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.

దశ మహావిద్యలపై ప్రవచనం



అనుగ్రహ భాషణం చేస్తున్న శ్రీసిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి

సీతంపేట : లలితాపీఠంలో జరుగుతున్న దశ మహావిద్యల ప్రవచనాలలో భాగంగా మూడో రోజు 'దశ మహావిద్యల ఆవిర్భావం'కు సంబంధించి పురాణ విశేషాలపై లలితాపీఠాధిపతి శ్రీసిద్ధేశ్వరానంద భారతి మహాస్వామి అనుగ్రహ భాషణం చేశారు. దశ మహావిద్యలలో చిన్నమస్త అనే శక్తి దేవత స్వరూప స్వభావాలను ప్రవచించారు. అలాగే రేణుకా దేవి కథలోని అంతరార్థం విశ్లేషించారు. శక్తి పీఠాధీశ్వరి రమ్యానంద భారతి స్వామిని, పెద్ద సంఖ్యలో భక్తులు, పండితులు, సాహితీవేత్తలు పాల్గొన్నారు. పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

యవకుడికి గాయాలు

మర్రిపాలెం: కంచరపాలెం పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన రోడ్డు ప్రమాదంలో యువకుడు గాయపడ్డాడు. అక్కయ్యపాలెంలోని గొల్లలపాలెంకు చెందిన నడిపిల్లి తేజ ఓ పాలిటెక్నిక్ కాలేజ్‌లో చదువుతూ స్విగ్గీలో డెలివరీ బాయ్‌గా విధులు నిర్వహిస్తున్నాడు. మంగళవారం విధుల్లో భాగంగా నాల్గవ పట్టణ పోలీస్ స్టేషన్ దరి ఓ హోటల్ నుంచి ఐటీఐ జంక్షన్ సమీపంలో ఫుడ్‌ను డెలివరీ చేసేందుకు ఊర్వశీ బీఆర్‌టీఎస్ సర్వీస్ రోడ్డులో వెళ్తుండగా ఎదురుగా ఓ వ్యక్తి బైక్‌పై వేగంగా వచ్చి ఢీకొన్నాడు. దీంతో తేజకు తీవ్రగాయాలయ్యాయి. అతను ప్రస్తుతం ఓ ప్రైవేట్ ఆస్పత్రిలో ఐసీయూలో చికిత్స పొందుతున్నాడు. తేజ తండ్రి నడిపిల్లి అప్పల నాయుడు ఫిర్యాదు మేరకు ఐదో పట్టణ సీఐ ఎస్ విజయ్‌కుమార్ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఢీకొట్టిన వ్యక్తి వివరాలు తెలియరాలేదని పోలీసులు వెల్లడించారు.

రహదారుల కళకళ



మెరిసిపోతున్న సీతంపేట మెయిన్ రోడ్డు



సుందరంగా శంకరమఠం మెయిన్‌రోడ్డు



మధురానగర్‌లో కొత్తగా వేసిన బీటీ రోడ్డు

సీతంపేట: జీవీఎంసీ 25వ వార్డులో రహదారులు మెరిసిపోతున్నాయి. వార్డు పరిధిలో చాలా వరకు రహదారులు మెరుగుపరచడంతో కళకళలాడుతున్నాయి. వార్డు కార్పొరేటర్ సారిపిల్లి గోవింద్ చొరవతో మధురానగర్ కాలనీలో బీటీ రోడ్లు కొత్తగా వేశారు. అలాగే హైవే నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్‌కు వెళ్లే సీతంపేట వరకూ 15 ఫైనాన్స్ కమిషన్ నిధులతో బీటీరోడ్డు నిర్మించారు. సుమారు రూ.50 లక్షలు ఖర్చుచేశారు. అలాగే హైవే నుంచి డైమండ్ పార్కు వరకు శంకరమఠం వరకు బీటీ రోడ్ నిర్మించారు. హైవే నుంచి నగరంలోకి వాహనాలు ప్రవేశించే ప్రధాన మార్గాలు రెండూ సుమారు కోటి రూపాయలు, 15 ఫైనాన్స్ కమిషన్ నిధుల వ్యయంతో కొత్తగా బీటీ రోడ్లు వేశారు. గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా విడుదలైన నిధులతో గతంలో పలు ప్రాంతాల్లో బీటీ రోడ్లు నిర్మించారు. దీనిలో భాగంగా సీతంపేట రాధాకృష్ణ మందిరం నుంచి విజయమెడికల్స్ వరకు ఉన్న గొల్లవీధి, అలాగే గణేష్ నగర్ చిన్న వినాయక గుడి నుంచి పాత పెట్రోల్ బంకు దుర్గమ్మ ఆలయం వరకు గతంలో బీటీ రోడ్లు నిర్మించారు. దీంతో ప్రధాన రహదారులు, అనుబంధ రహదారులు మెరిసిపోతున్నాయి. కొత్త రహదారులపై వాహనాల ప్రయాణం సాఫీగా సాగుతోంది. నిత్యం వాహనాల రాకపోకలతో రద్దీగా ఉండే మెయిన్‌రోడ్లు పునరుద్ధరించడంతో స్థానికులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

'ఉత్తర' పార్టీ కార్యాలయంలో గ్రీవెన్స్



వినతులు స్వీకరిస్తున్న నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు

సీతమ్మధార : జీవీఎంసీ పరిధి 14 వార్డులోని బాలయ్యశాస్త్రి లేఅవుట్‌లోని ఉత్తర నియోజకవర్గం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలోని మంగళవారం నెడ్‌క్యాప్ చైర్మన్, ఉత్తర సమన్వయకర్త కేకే రాజు ఆధ్వర్యంలో గ్రీవెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు పలు సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. వీటిలో కొన్నింటిని వెంటనే పరిష్కరించగా.. మరి కొన్నింటిని సంబంధిత అధికారులకు రిఫర్ చేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఫ్లోర్ లీడర్ అల్లు శంకరావు, కార్పొరేటర్లు సాడిపద్మారెడ్డి, వి.ప్రసాద్, వార్డు అధ్యక్షులు పీలా వెంకటలక్ష్మి, నీలి రవి, మాజీ కార్పొరేటర్ ఎం.పోలారావు, కిరణ్ రాజు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టుల భర్తీకి దరఖాస్తుల ఆహ్వానం

మర్రిపాలెం : అంగన్‌వాడీ కేంద్రాల్లో ఉద్యోగాల కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు ఐసీడీఎస్ అర్బన్ సీడీపీఓ రమణకుమారి మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు 12 ఆయా పోస్టులకు సంబంధించి నోటిఫికేషన్ విడుదల చేసినట్టు వెల్లడించారు. అర్హత కలిగిన అభ్యర్థుల నోటిఫికేషన్ దరఖాస్తు ఫారంను వెబ్‌సైట్ నుంచి డౌన్లోడ్ చేసుకోవాలని కోరారు. అలాగే తగిన నివాస ధ్రువపత్రాలతో దరఖాస్తులు సంబంధిత అర్బన్ కార్యాలయాల్లో బుధవారం నుంచి జూన్ 15వ తేదీలోపు సమర్పించాలని కోరారు.

చిన్నూరు రోడ్డులో డివైడర్ ఏర్పాటు

సాక్షి ఎఫెక్ట్..



చిన్నూరు 80 అడుగుల రోడ్‌లో ఏర్పాటు చేసిన డివైడర్

సీతంపేట: జీవీఎంసీ 26వ వార్డు చిన్నూరులో 80 అడుగుల రోడ్డు మధ్యలో డివైడర్ ఏర్పాటు చేశారు. విస్తరణలో భాగంగా గతంలో రోడ్డు మధ్యలో దీపాలు ఏర్పాటు చేసి, డివైడర్ నిర్మించకుండా వదిలేశారు. దీంతో వాహనదారులు ఇష్టానుసారంగా ప్రయాణించడం, చిరు వ్యాపార దుకాణాల వద్ద వాహనాలు నిలిపివేయడం, రద్దీ కారణంగా రాకపోకలకు ఇబ్బంది కలిగేది. స్థానికుల ఇబ్బందులను ×డివైడర్ నిర్మించాలని వినతి« శీర్షికన గత నెల 31న సాక్షిలో ప్రచురించిన వార్తకు అధికారులు స్పందించారు. స్థానికుల వినతి మేరకు జీవీఎంసీ సిబ్బంది డివైడర్ ఏర్పాటు చేశారు.

అబివృద్ధి పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ

మర్రిపాలెం: జవీఎంసీ 51వ వార్డులో అభివృద్ధి పనులను వార్డు కార్పొరేటర్ రెయ్యి వెంకటరమణ పరిశీలించారు. మంగళవారం గాంధీనగర్‌లో జరుగుతున్న పనులను ఆయన స్వయంగా పరిశీలించారు. రూ.33 లక్షలతో బీటీ రోడ్డు నిర్మాణానికి వైఎస్సార్‌సీపీ ఉత్తర సమన్వయకర్త కేకే రాజు శంకుస్థాపన చేసిన విషయం తెలిసిందే. ఆ పనుల తీరుతెన్నులను కార్పొరేటర్ పరిశీలించారు. ఈ కార్యక్రమంలో బి.తిరుమల రావు, కరిమిరెడ్డి శ్యామ్, గణేష్, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

దిశా ఫౌండేషన్ సభ్యులకు గుర్తింపు కార్డులు



నెడ్‌క్యాప్ చైర్మన్ కేకే రాజును సత్కరిస్తున్న దిశా ఫౌండేషన్ ప్రతినిధులు

సీతమ్మధార : దిశా ఫౌండేషన్ సభ్యులకు వైఎస్సార్‌సీపీ ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ చైర్మన్ కేకేరాజు గుర్తింపు కార్డులు అందజేశారు. మంగళవారం బాలయ్యశాస్త్రిలే అవుట్‌లోని ఉత్తర పార్టీ కార్యాలయంలో కార్యక్రమంలో భాగంగా సభ్యులకు ఐడీ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కేకేరాజును వారంతా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పేడాడ రమణికుమారి, దిశా ఫౌండేషన్ రాష్ట్ర ప్రెసిడెంట్ కె.స్వాతి వర్మ, జిల్లా అధ్యక్షురాలు కంచర్ల శిరీష, ట్రైబల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్ నాగమళ్ల సునీత, కాకినాడ అధ్యక్షురాలు వెన్నెల, ఉత్తర అధ్యక్షురాలు సుజాత, కొల్లి రమణమ్మ, సోనీ తదితరులు పాల్గొన్నారు.

కానిస్టేబుళ్లకు బదిలీ



ఫోర్తుటౌన్‌లో బదిలీల ప్రక్రియలో పాల్గొన్న కానిస్టేబుళ్లు

సీతమ్మధార : ఫోర్త్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ట్రాఫిక్, క్రైం, లా అండ్ ఆర్డర్‌లో పనిచేసి ఐదేళ్లు దాటిన వారికి నగర పోలీస్ కమిషనర్ మంగళవారం ఆన్‌లైన్ ద్వారా 24 మంది కానిస్టేబుళ్ల బదిలీ ప్రక్రియకు శ్రీకారం చుట్టారు. పలువురు కానిస్టేబుళ్లను ఎంవీపీ, పెందుర్తి, ద్వారకా, గోపాలపట్నం తదితర పోలీస్‌స్టేషన్లకు బదిలీ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

అమ్మవార్ల పండగ సందడి



మూడుగుళ్ల వద్ద మహిళల కోలాటం



ప్రతిమలను ఊరేగిస్తున్న మహిళలు



పూజలందుకుంటున్న అమ్మవారు

సీతంపేట: సీతంపేట, అక్కయ్యపాలెం గ్రామ దేవతల పండుగలతో ఆయా ప్రాంతాల్లో సందడి నెలకొంది. అక్కయ్యపాలెం గ్రామ దేవత ముత్యమాంబ అమ్మవారి పండగ అంగరంగ వైభవంగా నిర్వహించడానికి గౌరీ సేవా సంఘం ఏర్పాట్లు చేసింది. ఉత్సవంలో భాగంగా తొలివారం భూలోకమాత ఉత్సవం జరిగింది. పరిసర ప్రాంతాలకు చెందిన మహిళలు అమ్మవారికి పసుపు,కుంకుమ, మొక్కుబడులు సమర్పించారు. అమ్మవారి ఘటాలను రామాలయం నుంచి మూడుగుళ్ల వరకు మేళతాళాలతో ఊరేగించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన తప్పెటగుళ్లు, కోలాటం, గరిడీలు ఆకట్టుకున్నాయి. ఈ సందర్భంగా సంఘం గౌరవాధ్యక్షుడు పాలమరశెట్టి ఎస్‌జీవీ ప్రసాద్ మాట్లాడుతూ ఈనెల 13న కుంచుమాంబ ఉత్సవం, 19న పుట్టబంగారమ్మ వేడుకలు, తొలేళ్ల సంబరం జరుగుతుందన్నారు. 20న ముత్యమాంబ అమ్మవారి ప్రధాన పండుగ జరుగుతుందని తెలిపారు. సంఘం అధ్యక్షులు కొయిలాడ వేణుగోపాల్, చైర్మన్ రాజగిరి అప్పలరాజు, వైస్ చైర్మన్ మళ్ల త్రినాథరావు, ప్రధాన కార్యదర్శి ఆడారి పారుపల్లి రవి, కోశాధికారి పెంటకోట సత్యప్రసాద్ ఏర్పాట్లు పర్యవేక్షించారు.

సీతంపేటలో... : సీతంపేట గ్రామ దేవత కనకమాంబ అమ్మవారి పండుగ మహోత్సవంలో భాగంగా తొలివారం భూలోకమాత పండుగ నిర్వహించారు. గ్రామంలోని మహిళలు అమ్మవారికి పసుపు, కుంకుమ సమర్పించారు. ఈ నెల 11న అమ్మవారి పండుగ చాటింపు, 12న తొలేళ్ల పండుగ, 13న కనకమాంబ అమ్మవారి ప్రధాన పండుగ జరుగుతుందని ఉత్సవ కమిటీ చైర్మన్ సారిపిల్లి సంతోష్ తెలిపారు.

ముంపు ప్రాంతాలను ముందుగా గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

మహారాణిపేట : రాబోయే వర్షా కాలంలో వరద నిర్వహణకు లోతట్టు ప్రాంతాలు, ముంపు ప్రాంతాలను ముందుగా గుర్తించాలని విశాఖ రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీవో) డి.హుస్సేన్‌సాహెబ్ అధికారులను ఆదేశించారు . మంగళవారం సాయంత్రం తన ఛాంబర్లో 2023 నైరుతి-పశ్చిమ రుతు పవనాలతో వర్షాలు కురిసినప్పుడు తీసుకోవాల్సిన చర్యలపై సమావేశం నిర్వహించారు . ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తహసీల్దార్లు మండల స్థాయిలో ఎంపీడీవోలు, ఎలక్ట్రికల్, మెడికల్, మున్సిపల్, వ్యవసాయం, పశుసంవర్ధక, అగ్నిమాపక, టెలికమ్యూనికేషన్ తదితర శాఖల అధికారులతో సమావేశం నిర్వహించాలన్నారు. తుపాను షెల్టర్ల పరిస్థితిని పరిశీలించి మరమ్మతులు అవసరమైతే చేయించాలని ఆదేశించారు. జిల్లాలో సంబంధిత ప్రదేశాల్లో తగినంత మందుల నిల్వలు అందుబాటులో ఉండేలా చూడాలని వైద్య శాఖ అధికారులకు తెలిపారు. మండల స్థాయిలో రెవెన్యూ, పోలీసు, వైద్య, అగ్నిమాపక, రోడ్లు - భవనాలు, ఇతర శాఖలకు సంబంధించిన అధికారుల సమన్వయంతో మాక్‌డ్రిల్ నిర్వహించాలన్నారు. జీవీఎంసీ పరిధిలో శిథిలావస్థకు చేరిన భవనాలను గుర్తించి, తగు చర్యలు చేపట్టాల్సిందిగా ఆదేశించారు. కార్యక్రమంలో ఆర్డీవో కార్యాలయ ఏవో మనోరంజిని, మెడికల్, జీవీఎంసీ, పోలీస్ శాఖ అధికారులు, తహసీల్దార్లు పాల్గొన్నారు.

అప్పన్నకు విశేషంగా ఆర్జిత సేవలు



నిత్యకల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం విశేషంగా ఆర్జిత సేవలు జరిగాయి. ఉదయం 9.30 నుంచి నిత్యకల్యాణం శాస్త్రోక్తంగా నిర్వహించారు. స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి,భూదేవిలను కల్యాణ మండపంలోని వేదికపై అధిష్ఠంపజేశారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, సంకల్పం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగల్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణం కమనీయంగా నిర్వహించారు. ఉభయదాతలకు స్వామివారి ప్రసాదం, శేషవస్త్రాన్ని అందజేశారు.

ఘనంగా గరుడసేవ

శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి మంగళవారం గరుడసేవ ఘనంగా జరిగింది. ఆలయ కల్యాణ మండపంలోని గరుడవాహనంపై స్వామివారి ఉత్సవమూర్తి గోవిందరాజస్వామిని అధిష్ఠంప జేసి అష్టోత్తరశతనామావళిపూజ చేశారు. విశేషంగా హారతులు అందజేశారు. భక్తులను గరుడవాహనం చుట్టూ ప్రదక్షిణ చేయించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

మురళీనగర్ : మర్రిపాలెం సెక్షన్ పరిధిలోని కప్పరాడ 11కేవీ ఫీడర్ నిర్వహణ పనులు కారణంగా పలు ప్రాంతాల్లో గురువారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏపీఈపీడీసీఎల్ జోన్-2 ఈఈ బీకే నాయుడు తెలిపారు. ఈ మేరకు అరుంధతీనగర్, జయప్రకాష్‌నగర్, బాపూజీనగర్, తిక్కవానిపాలెం, సంజీవయ్యకాలనీ, అప్పర్ జయప్రకాష్‌నగర్, కప్పరాడ, రాంజీ ఎస్టేట్, కొత్తూరు ప్రాంతాల్లో ఆరోజు ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

ఆంధ్ర విశ్వవిద్యాలయానికి అమృతకాలం

- జాతీయస్థాయిలో ఏయూకు అగ్రాసనం
- యువతను ఆవిష్కర్తలుగా తీర్చిదిద్దుతున్న స్టార్టప్‌లు
- పెరుగుతున్న వర్సిటీ పేటెంట్‌ల సంఖ్య



ఏయూ మెయిన్ గేట్



స్టార్టప్ ఇంక్యుబేషన్ సెంటర్

ఏయూక్యాంపస్ : ఆంధ్ర విశ్వవిద్యాలయం శతాబ్ది ఉత్సవాలకు చేరువవుతోంది. వ్యవస్థాపక ఉపకులపతి కట్టమంచి రామలింగారెడ్డి, సర్వేపల్లి రాధాకృష్ణన్ వంటి దార్శనికులు వేసిన బలమైన పునాదులపై నిర్మితమైన విశ్వవిద్యాలయం నేడు మరింత ఉన్నత శిఖరాలను చేరుకుంటోంది. వర్తమాన సాంకేతిక ప్రగతికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే దిశగా ప్రస్తుత ఉపకులపతి ఆచార్య పి.వి.జి.డి ప్రసాదరెడ్డి చేస్తున్న కృషి సత్ఫలితాలనిస్తోంది. నాలుగేళ్లుగా జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు వర్సిటీకి అమృతకాలంగా చెప్పవచ్చు.

ఆవిష్కర్తలుగా నిలిపే 'ఆ హబ్'

కాలంతోపాటు మనం మారాలి.. అప్పుడే మనుగడ సాధ్యపడుతుంది. ఈ సూత్రాన్ని ఆచరణలో చూపుతోంది ఏయూ. నాలుగేళ్ల కిందట ఉపకులపతిగా బాధ్యతలు చేపట్టిన వెంటనే ఏయూలో స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ ఏర్పాటు చేయాలని వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి సంకల్పించారు. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా లేని విధంగా స్టార్టప్, ఇంక్యుబేషన్ సెంటర్ 'ఆ హబ్'కి ప్రాణం పోశారు. ఇందుకోసం ప్రత్యేకంగా ఓ సీఈవోను నియమించి.. నేడు వందకు పైగా అంకుర సంస్థలు, 500 మందికి పైగా యువత పనిచేసేలా తీర్చిదిద్దారు. దీనికి చేరువలో రూ.22 కోట్ల వ్యయంతో కేంద్ర ప్రభుత్వ సాయంతో నాస్కామ్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌ను ప్రారంభించి, మరిన్ని స్టార్టప్‌లకు ఊతం అందించారు.

జాతీయ స్థాయిలో అత్యుత్తమ ర్యాంక్

జాతీయస్థాయిలో వివిధ సంస్థలు ఇచ్చే వివిధ ర్యాంకుల్లో ఏయూ ముందు వరసలో ఉంటోంది. కేంద్ర మంత్రిత్వ శాఖ అందించే ఎన్ఐఆర్ఎఫ్ ర్యాంకింగ్‌లో 43వ స్థానం సాధించింది. ఇటీవల ది వీక్-హన్స్ సర్వేలో జాతీయ స్థాయిలో మల్టీ డిసిప్లినరీ విశ్వవిద్యాలయాల విభాగంలో ఏయూ 9వ స్థానాన్ని సాధించింది. అఖిల భారత స్థాయిలో టాప్ 10లో ఏయూ నిలవాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షను సాకారం చేసే దిశగా ఏయూ పని చేస్తోంది.

చెయిర్ ప్రొఫెసర్.. ప్రొఫెసర్ ఆన్ ప్రాక్టీస్

యూజీసీ ప్రారంభించే ప్రతీ పథకాన్ని పూర్తిస్థాయిలో అమలు చేయడంలో ఏయూ ముందుంటోంది. ఎన్ఈపీ 2020ను కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన వెంటనే శతశాతం అమలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం నిబద్ధతకు మరింత బలాన్ని అందించే విధంగా ఏయూ పనిచేస్తోంది. రాష్ట్ర ప్రభుత్వ విశ్వవిద్యాలయాల్లో ఎక్కడా లేనన్ని చెయిర్ ప్రొఫెసర్లను ఏయూ ఇప్పటికే సాధించింది. వివిధ పరిశ్రమలు, సంస్థలు, వ్యక్తుల సహాయంతో దాదాపు 20కి పైగా చెయిర్ ప్రొఫెసర్‌లను ఏర్పాటు చేసింది. విభిన్న రంగాల్లో నిష్ణాతులైన నిపుణులను ప్రొఫెసర్ ఆన్ ప్రాక్టీస్‌గా స్వీకరిస్తూ.. పరిశ్రమల అవసరాలకు అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దే ప్రయత్నంలో సఫలీకృతమైంది.

ఐఐసీలో జాతీయస్థాయిలో నాల్గో స్థానం

అఖిల భారత స్థాయిలో అడుగిడిన తొలి సంవత్సరమే ఇన్‌స్టిట్యూషన్స్ ఇన్నోవేషన్ కౌన్సిల్‌లో జాతీయ స్థాయిలో 4 స్టార్ ర్యాంకింగ్ సాధించింది. కేంద్రీయ, ప్రఖ్యాత విశ్వవిద్యాలయాలకు దీటుగా ఏయూ ఈ ర్యాంకును పొందింది.

పేటెంట్‌ల ప్రవాహం

ఏయూలో రెండేళ్ల కిందట ఏర్పాటైన ఐపీఆర్ చెయిర్ ఎంతో ప్రభావవంతంగా పనిచేస్తోంది. ఇప్పటికే 70కి పైగా పేటెంట్‌లను వర్సిటీ నుంచి దాఖలు చేయడం, పదుల సంఖ్యలో పేటెంట్‌లు సాధించడం చకచకా జరిగిపోయింది. మేధో హక్కులపై విద్యార్థులకు కోర్సును రూపకల్పన చేసి అందించి ఘనత ఏయూకే దక్కుతుంది. రాష్ట్రానికి నోడల్ ఏజెన్సీగా ఏయూ సేవలు అందిస్తోంది. పేటెంట్‌ను కమర్షియలైజ్ చేయడంలో కూడా ఏయూ ముందుంది.

నాడు-నేడుతో భవనాలకు పూర్వ వైభవం

రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన నాడు-నేడు పథకం స్ఫూర్తితో వర్సిటీలో భవనాలు, హాస్టళ్లు పూర్తిస్థాయిలో తమ స్వరూపాన్ని మార్చుకున్నాయి. దశాబ్దాలుగా నిర్లక్ష్యానికి గురైన హాస్టల్ భవనాలు పూర్తిస్థాయిలో మరమ్మతులు పూర్తి చేసుకున్నాయి. సీఎస్సార్ నిధులతో అభివృద్ధి చేసిన మౌలిక వసతులు, మైదానాలు వర్సిటీకి అతిపెద్ద వనరుగా నిలుస్తున్నాయి. అన్యాక్రాంతమైన వందలాది కోట్లు విలువైన భూములను స్వాధీనం చేసుకోవడంలో అధికారుల చిత్తశుద్ధి సైతం విశాఖ ప్రజల అభిమానాన్ని చూరగొంది. ఫార్మా హబ్, ఏయూ స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్, డిజిటల్ జోన్, డాల్బీ అట్మాస్ రికార్డింగ్ స్టూడియో తదితర ప్రాజెక్టులు వర్సిటీ కీర్తికిరీటంలో కలికితురాళ్లుగా నిలవనున్నాయి.

ఉపాధి అవకాశాల వెల్లువ

వర్సిటీలో చేరిన ప్రతీ విద్యార్థి ఉపాధి అవకాశంతో బయటకు వెళ్లాలనే ఆశయంతో వర్సిటీ పనిచేస్తోంది. ఇప్పటికే ఇంజినీరింగ్, సైన్స్, ఆర్ట్స్, న్యాయ, ఫార్మసీ విభాగాలకు చెందిన మూడు వేల మందికి పైగా విద్యార్థులకు ఉద్యోగ అవకాశాలు కల్పించింది. ఏయూ చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఇంజినీరింగ్ కళాశాల విద్యార్థిని ఈశ్వరీ ప్రియ రూ.84.5 లక్షల వార్షిక వేతనంతో ఉద్యోగం సాధించి, రికార్డ్ సృష్టించింది.

హెల్మెట్ల పంపిణీ



హెల్మెట్లు పంపిణీ చేస్తున్న ఏడీసీపీ శ్రీనివాసరావు

బీచ్‌రోడ్డు: ప్రమాద రహిత ప్రయాణానికి హెల్మెట్ ధారణ తప్పనిసరి అని ట్రాఫిక్ ఏడీసీపీ శ్రీనివాసరావు అన్నారు. పుదుచ్చేరి రాష్ట్ర మాజీ మంత్రి మల్లాడి కృష్ణారావు 60వ జన్మదినం సందర్భంగా తీరంలో మంగళవారం హెల్మెట్లు పంపిణీ చేశారు. రాష్ట్ర బీసీ నాయకుడు విశ్వనాథపల్లి నాగసుందరం ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని ఏడీసీపీ ప్రారంభించారు. కార్యక్రమంలో ట్రాఫిక్ ఏసీపీలు రాజీవ్ కుమార్, జాన్ మనోహర్, సంస్థ ప్రతినిధులు బచ్చల త్రిమూర్తులు, సుమిత భరత్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.